# డయాబిటీస్

**డాక్టర్**తో ముఖాముఖీ

డాక్టర్ - హలో ! ఎవరండీ!

వాణి - నేను అనంతవాణినండి! విజయవాడ నుంచి

డాక్టర్- ఆ! చెప్పండి! ఏమిటి మీ సమస్య?

వాణి - నేను ఆరోగ్యంగానే ఉన్నానండి. మా ఆయనికి షుగర్ వ్యాధి. పోస్ట్ లంచ్ 425 ఉంది.

డాక్టర్- మీ ఆయన్ని మాట్లాడమనండి.

వాణి - పెళ్ళైనప్పట్నుంచీ ఆయన నోరు విప్పితే ఒట్టు డాక్టర్.

డాక్టర్ - టెన్షన్‌వల్ల కూడా షుగర్ ఎక్కువ అవుతుంది. షుగర్ ఎన్ని సంవత్సరాల నుంచి?

వాణి - పది సంవత్సరాల్నుంచండి.

డాక్టర్ - మీ అత్తమామలకి కూడా షుగర్ ఉందా?

వాణి- అవునండి. ఇద్దరికీ ఉండేది. మా అత్తగారు షుగర్‌వల్లే పోయారండి.

డాక్టర్ - సారీ! అమ్మా!

వాణి- సారీ ఎందుకండీ! ఆవిడ పోయిన తర్వాత సుఖపడుతున్నాను.

డాక్టర్ - ప్రస్తుతం మీ మామగారున్నారా?

వాణి - ఆ గయ్యాళి పోయిన సంతోషం పట్టలేక, ఈయన గుండె ఆగిపోయింది.

డాక్టర్ - వెరీగుడ్

వాణి - ఆయన పోతే వెరీగుడ్ ఏమిటి డాక్టర్! ఆయన చాలా ఉత్తములు! ఆయన నన్నసలు బాధపెట్టలేదు.

డాక్టర్ - అయితే ఆయన పోయినందుకు సారీ! అమ్మా! టీవీలో ఈ హెల్త్ ప్రోగ్రామ్ టైమ్ మొత్తం మీరే తినేస్తున్నారు. ఇక సరి పెట్టండి.

వాణి - ప్లీజ్ డాక్టర్! భర్తలో సగభాగం భార్య అంటారు కదా! నేను నడిస్తే మా ఆయన షుగర్ తగ్గుతుందాండి.

డాక్టర్ - తప్పమ్మా. అలా నేనొప్పుకోను.

వాణి - నాకు షుగర్ లేదు కాని, విపరీతమైన నీరసం, డాక్టర్ ఎలా తగ్గుతుంది ఈ నీరసం.

డాక్టర్ - మీరు సార్థక నామధేయులు అనంత వాణిగారూ! మీరు మాట్లాడ్డం తగ్గిస్తే మీ నీరసం తగ్గుతుంది.

( చతుర, ఆగస్టు 2005)